# కిటికీ

ఒ...క...టీ...ఒ...క...టీ-

అడుగులు నెమ్మదిగా వేస్తూ వెళ్తోంది పాతకర్ర.

అరిగిన పాతకర్రని పట్టుకున్న ఎండిన కొమ్మలాటి చెయ్యికూడా దాన్తోపాటు అలానే నెమ్మదిగా వెళ్తోంది.

విద్యుద్దీపాల వెలుగునంతటినీ ఆరబోసిన ముగ్గులా పరుచుకున్న సిమ్మెంటురోడ్డు అంతే నెమ్మదిగా వెనక్కి జరుగుతోంది.

వెళ్ళగా, వెళ్ళగా ఆరబోసిన ముగ్గు గడ్డకట్టిన తారుగా మారింది.

కృష్ణసర్పంలా మెరిసే తార్రోడ్డుకూడా వెనక్కి జరిగి జరిగి ఆఖరయింది.

పాతకర్ర ఆగి సేదతీర్చుకొంది ఒక్కక్షణం.

ఇంకా ఎంతదూరం?

తారూ, కంకరా కలిసే స్థలంనుంచి ఇంకా యిరవై 'ఎలక్ట్రీ' దీపాలు దాటాలి. అక్కడనుంచి ఎడంచేతివైపు మళ్ళి, ఎనభయ్యడుగులు నడవాలి.

ఇరవై దీపాల కంకర్రోడ్డూ, ఎనభయ్యడుగుల కాలిబాటా దాటగా, ఎడమవైపున ఉండేది పాతమేడ;

కుడివైపున ఉండేది సగం కూలిన పెంకుటిల్లూ.

ఆ పాతమేడ వినా ఆ ప్రాంతం విద్యుచ్ఛక్తితో గాని మరెట్టి కాంతితోగాని ప్రకాశించదు. అంతా అంధకారం.

ఎదురెదురుగా ఉన్న ఆ రెండు ఇళ్ళూ దాటిన తరువాత ఏవేవో తోటలూ, ఎవరెవరివో చిన్న చిన్న ఇళ్ళూ లేకపోలేదు.కాని,ఎండినచేత్తో ఆ పాతకర్రని పట్టుకున్న మనిషికి వాటి వేటితోనూ సంబంధం లేదు.

కూలిపోయే ఇంట్లో ఇంకా పూర్తిగా పడిపోకుండా నిల్చిన వరండాలో కూర్చొని చూడ్డానికే అతను వెళుతున్నది.

క్షణంసేపు సేదతీర్చుకున్నాక, దీపాలు లెక్కపెట్టుకుంటూ, ఎంతో అలసిపోయినట్టుగా ఊపిరితీస్తూ బరువునడక సాగించేడు.

ఇరవై దీపాల దూరంగల కంకర్రోడ్డు ఎలాగయితేనేం వెనక్కి వెళ్ళింది. పాతకర్ర ఎడమవైపుకి మళ్ళింది.

ఇహ ఉన్నవి ఎనభయ్యే అడుగులు.

పైన చంద్రుడు లేడు. పక్కన మ్యున్సిపల్ దీపాలు లేవు. నక్షత్రాలకాంతి అతనికంటికి చాలదు.

చాలా చీకటిగా ఉంది. కొంచెం చలిగాలి వీచింది.

చీకటిగా ఉన్నప్పటికీ చేతికర్రకి దారి బాగా తెలుసు. అలసిపోయి నప్పటికీ ఎనభయ్యడుగుల మేరనీ తొందరగా వెనక్కినెట్టి నిట్టూర్చింది.

అదిగో కిటికీ !!

ఇదిగో వరండా!

పెంకుటింటి ముందు భాగం మాత్రం కొంత నిల్చింది. చీకటితో నిండిన ఆ వరండాపై కప్పు ఒక వార కొంత మేర కూలింది. క్రింద గచ్చు ఎన్నో చోట్ల, దాదాపు అంతటా గాయాలు పడింది. ఉన్న రెండు రాతి స్తంభాలకీ రక్తమాంసాల్లేవు. ఇంటికి ఇవతల నిల్చొని ఇంటిమీదకూ్కడా విస్తరించుకుంది ఓ మామిడి చెట్టు. కప్పు కూలినవైపు వరండా మీదా, ఆ మామిడిచెట్టు మీదా ఎదుట మేడలోంచి వచ్చేదీపం వెలుగు పల్చగా పడుతోంది.

ఆ వరండాలో చీకటిగా ఉన్న వైపు గోడని ఆనుకుని కూర్చొని, కర్రని పక్కన పెట్టి, ఎడం భుజాన ఉండే బరువు తీసి ఎదురుగా పెట్టుకొని, ఎదట మేడవైపు తలెత్తి చూశాడతను.

కిటికీ కనిపిస్తూనే ఉంది.

మిగతా మేడంతా చీకటి. ఆ కిటికీయే కనిపిస్తోంది.

చాలీ చాలని నక్షత్ర కాంతి నిగ నిగలాడే రాత్రిలో కరిగిపోతోంది ఎదట ఉండే పాతమేడా, మేడ వెనక తాటిచెట్టు వరసా, చీకట్లో కలిసీ కలియనట్టుగా ఉన్నాయి. తాటిచెట్ల తలల్లోంచి చిన్న చిన్న చుక్కలు కనిపించని కదలికతో ఆకాశంలోకి లేస్తున్నాయి.

అవన్నీ చీకట్లో ఛాయలు, వట్టి నీడలు. ఆ నక్షత్రాలైనా, అవన్నీ, చీకట్లో మునిగిన, మెరుపు తగ్గిన రాళ్లు.

ఆ కిటికీ ఒక్కటే ఆ ప్రాంతంలో ఆ నిశీధంలో ధగధగ లాడేది; జిగ జిగ మెరిసేది.

మేడమీద ఒకటే గది. సరిగ్గా ఆ గది వెడల్పునా దాని పక్కనే చిన్న డాబా వుంది. గదినీ డాబానీ వేరుచేసే గదిగోడకి ఎదురుగా ఉంటుంది అతను కూర్చునే స్థలం. అతనికి ఎడమవైపుది గది, కుడివైపుది డాబా.

ఆ గది అట్టే పెద్దది కాదు. గదికి మధ్యగా ఉన్న ఆ కిటికీ చిన్నది కాదు. ఇనపవిగాని మరెట్టివిగాని కిటికీకి ఊచల్లేవు. తలుపులు తెరుచుకునే ఉంది. వెనక వెల్తురులో వజ్రంలా ప్రకాశిస్తోంది.

చిట్ట చీకటి తెరని ఆ కిటికీ ఉన్న ఒక్కచోటా కత్తిరించి అడుగున దాగున్న వెలుగుని ఎవరో చూపెడుతోన్నట్టుగా ఉంది. ఎవరో పుణ్యాత్ములు ఆ తెరని ఆ మేరకి కత్తిరించో లేక ఒత్తిగిలించో అవకాశం కలిగిస్తున్నారు. ప్రతి రాత్రీ అతనలా చూసి సంతోషించడానికి, అనునిమిషం తన్మయుడవడానికి.

తెరవెనక అంతా ఆనందం.

అతనికి లేనిది, అతనికి కావాలని ఉన్నది, అందరికి ఉండాలని అతను కోరేది అంతా ఆ కిటికీ వెనక ఉంది, కిటికీ లోంచి కన్పిస్తోంది.

కిటికీ వెనక ఉన్నది ఏమది?

తెల్లగా, వెల్ల వేసిన గోడతో ఒకే ఒక గది.

చీకట్లో కూర్చున్న మనిషికి ఆ గదిలోన కనిపించేవి ఏమవి?

ఆకుపచ్చ గాజుటోపీ పెట్టుకొని, తీగని పట్టుకోని, గది మధ్యకి జారిన విద్యుద్దీపం; ధగధగలాడే దీపం వెలుగు; ఎదటగోడని బ్రాకెట్ మీద ఒక నీలిరంగు గడియారం; దానికి పక్కగా పెద్దదికాని ఒక అద్దాల బీరువా! బీరువామీద పేర్చిన నల్లటి గంధపు బొమ్మలు; వాటిమధ్య రంగులు వేసిన రెండు చిన్న పాలరాతి విగ్రహాలు-ఒకరు లక్ష్మి; ఒకరు సరస్వతి;- బీరువాపైని గోడని ఒక పటం; అందులో, పడుకొని పుస్తకం చదివే ఆడమనిషి బొమ్మ; దానికి పైన గదికప్పు బిళ్ళ పెంకు; ఒకవార, దోమతెరకట్టిన పందిరిమంచపు కొన; కిటికీకి చేరువగా ఒకమనిషి కూర్చో వీలయే సోఫా;

ఇవన్నీ ఆ కిటికీలోంచి అతనికి సుస్పష్టంగా కనిపించకపోవడంచేతనే ఎక్కువ మనోహరంగా ఉంటాయతనికి.

ఆ గదిలో,

వాళ్లిద్దరూ ఉంటారు!

వాళ్ళిద్దరే ఉంటారు!

ఆవిడ;

ఆమె ప్రాణం విచ్చిన పాలరాతి బొమ్మ; చిగిర్చిన తీయమామిడి కొమ్మ;

వికసించిన కుసుమం; స్తంభించిన విద్యుల్లత; దిగివచ్చిన దేవత.

నవనవలాడే లేజవరాలు.

అతను;

అతని శరీరం మెరుగుపెట్టిన లోహం, అతన్ది కుతకుతలాడే రక్తం;

అతనొక కొమ్మపై వాలిన గండు కోయిల, అతను మనిషిగా మారిన మధుపం.

అత నామెకోసం దిగివచ్చిన దివ్యుడు.

అది గదిగా మారిన స్వర్గం. అది తెరవెనక స్వప్నం. అక్కడ నిత్యవసంతం.

తెరచిన తెరలోంచి, ఈ స్వప్నాన్ని, ఈ నిత్యవసంతాన్ని, ఈ స్వర్గాన్ని చూడ్డానికే అతను నడచినడచి నడచినడచి వస్తోంది.

ఎన్నాళ్ళనుంచి?

ఓ యాడాదవుద్ది కామోసు.

ఆ పట్నం వచ్చి సంవత్సరం అయింది. లేక, కావచ్చింది. వచ్చినరోజు రాత్రి దారితప్పి తిరుగుతూండగా, చీకట్లో దొంగదాటున వచ్చిన సికందరు సైన్యంలా; నల్లమబ్బులు అన్నివైపులనుంచీ కమ్మేశాయి. కురిసే వరకూ వర్షం వస్తోందన్న సంగతి అతను గమనించనేలేదు.

ఒక్కసారిగా, గడగడలాడించే చలీ, మొత్తేసే జడివానా వచ్చిపడ్డాయి.

పక్కనేవున్న ఆ వరండాలోకి తననీ చేతికర్రనీ చప్పున చేరవేయవలసి వచ్చింది.

ఆ దినం వంట్లో బావుంది కాదు. అన్నం హితవు కాలేదు, సహించింది కాదు.

చూస్తోండగానే గుండె చెరువయింది.

–యెదవ యెదవ యెదవది బ్రతుకు,

ఈ రీతిగా ఎన్నాళ్ళు? ఎన్నాళ్ళయినా యెందుకు?

వీధిలో యెండ, ఏటిలో నీరు, చెట్టుకింద నీడ, ఎంతకాలం యిలా?

ఎక్కణ్ణించి యెలావచ్చేను? ఇక్కడ యిలా యెందుకు ఉంటున్నాను?

ఎప్పుడు యెలా ఎక్కడికి పోతాను?

అనే ప్రశ్నలకి యెవరికైనా జవాబులు తెలుసునేమో కాని అతని కటువంటి ప్రశ్నలు వేసుకోడంకూడా సరిగ్గా తెలీదు.

'నేను' అనే పదంయొక్క అన్ని విభక్తులతోనూ నిండిన ఈ లోకంలో 'పడ్డం' చేత కలిగే నొప్పికి కారణం స్పష్టంగా కనిపిస్తూన్నా యెవ్వరికీ తెలియనట్టే అతనికూడా తెలీదు.

వర్షం పడుతోంది. చలివేస్తోంది. అతను దుప్పటి దగ్గరగా లాక్కొని కప్పుకున్నాడు. అతని పళ్ళంతా పీకుతోంది.

-కాళ్ళడి పోతున్నై.

దూసుకువచ్చే చలిగాలి, జల్లుజల్లుగా జడివాన, మధ్య మధ్య మెరుపు నాలికలు, మాటిమాటికీ ఉరుముల ఘోష.

వానజల్లుకి వరండా తడుస్తోంది. సగం మాత్రం నిల్చిన చూర్లోంచి నీరు కురుస్తోంది.

-సత్తే శానా సుఖం. ఏం? ఓ పిడుగడ కూడదా? పిడుగు పడింది కాదు. పిడుగులు యెక్కడెక్కడో పడ్డాయి. మూలనున్న ముసలమ్మని కొట్టడం యెందుకని కాబోలు, పడిపోయే పెంకుటింటిని మాత్రం అన్ని పిడుగులూ విడిచిపెట్టాయి!

-నాలాటోణ్ణి చూసే దాతే లేడు. బగవంతుడే సూణ్ణప్పుడు ఆరిమాటా ఈరిమాటా సెప్పుకునేటి నాబం?

పడేపిడుగులూ, చూసే దాతలూ, చూసీ చూడని భగవంతుడూ కూడా అంటకుండా దూరంలోనే ఉంటూ ఉండడం జరిగింది; జరుగుతోంది.

-ఈ పాలికి సత్తే బావుంటుంది.

'చస్తే బావుణ్ణు' అని అనుకొనేంతవరకూ పరిస్థితి 'వచ్చింది' అనడం నిజంకాదు.

పరిస్థితి యెప్పుడూ అక్కడే ఉంది.

పరిస్థితులు యెప్పుడూ ఒక్కలాగే ఉన్నాయి.

జ్ఞాపకం ఉన్నంత మట్టుకు యెప్పుడూ ఇలాగే ఉంది అవస్థ.

ఎవరు కన్నారో వారు గుర్తులో లేరు.

దౌర్భాగ్యులు, పాపాత్ములు, శక్తిహీనులు, బానిసలు.

ఎవరైతేనేం? ఎవరో ఒకరు కన్నారు.

భయంతో కన్నవారు భయపడి పారిపోయారు.

ఇహ జ్ఞప్తికి వచ్చేదెలా?

పెంచిన ముసలమ్మ మాత్రం బాగా గుర్తులో వుంది.

"నానేగాని చూడకపోతే ఆ పొద్దే సద్దువురా గుంట నా యదవ! ఇసివాసంగా బతకరా-"

అని మాటి మాటికీ చెప్తుండే ముసలమ్మ హింసించి హింసించి ఏనాడో పోయింది.

పోయేముందు ఈ దార్లోనే వదిలేసింది.

ముసలమ్మ నడిచి చూపెట్టిన దయ్యాలబాట వెంబడి నడవక తప్పడంలేదు.

మరో మార్గం కనిపించదు. ఎవరూ చూపించరు.

ఈ దయ్యపు బతుక్కి ఆనందం, సౌఖ్యం ఉండవు.

కాని-

కొన్ని-అతి తక్కువ-మధుర స్మృతులు మాత్రం ఉన్నాయి.

అవి ఎట్టివి? ఎంత గొప్పవి? లేకుంటే ఎంత బీదవి?

పచ్చటి ముఖంతో, రూపాయంత బొట్టుతో, కుండంత కొప్పుతో, మందహాస రేఖతో ఓ ముసలావిడ, ఓ మధ్యాహ్నం దయతో పిల్చి, ఆదరించి దీవించి పంపింది. దీవెన ఫలించక పోతేనేం? దయతో దీవించడం యెంత కాదు? ఒక నాడొక తప్పిపోయిన పిల్లని తల్లి దగ్గర చేరవేసినందుకు కాతల్లి ఒక సరికొత్త పంచె యిచ్చింది. ఒకరాత్రి, తాగి తందనాలాడే సీమ సిపాయి అయిదు రూపాయలు పారేసుకున్నాడు. తన అన్నం కొంత పెట్టినందుకు ఒకరాత్రి ఒక ఆడమనిషి వంటిమీద చెయ్యి వేయనిచ్చింది. ఓనాడు కరవ్వచ్చిన వెర్రికుక్కని యెవరో వచ్చి తరిమి తరిమికొట్టేరు. ఓ సాయంకాలం ఓ పోలీసువాడు కొట్టకుండా విడిచిపెట్టేడు.

స్మృతిపథాన మధురంగా మెరిసేవి, ఇవిగాక!

ఓ వూళ్లో ఓ మధ్యాహ్నం, చెట్టుకింద గజ్జెకట్టి గంతులు వేసిన చక్కని ఆడపిల్లా, రెయిలుబండీలో కూర్చొని పిల్లడికి పాలిస్తూ ఒకసారి కనిపించిన వెన్నెలవంటి ఒక చల్లని తల్లీ, ఒకరాత్రి 'ఊర్మిళమ్మ నిద్ర' పదం పాడిన జంగిలీవాడూ, ఓ సత్రంలో కూర్చొని ఒకరాత్రి చిలుం వేడిలో మంచుకొండ మహిమలు చెప్పిన బైరాగివాడూ....

వీళ్ళగురించి, వీటిగురించి తల్చుకున్నప్పుడుకూడా మధురంగా ఉంటుంది.

మిగతాదంతా,

గడ్డు గడ్డు గడ్డు బతుకు.

కాలంతో ఉన్నన్నాళ్ళు, జబ్బుచేయనన్నాళ్ళు పరవాలేకపోయింది.

ఇప్పుడు కాలంబాగా మళ్ళింది. జబ్బుచేసింది. కర్రపట్టుకొంటూంటే చెయ్యి వణుకుతోంది. చలికాలం కాకపోయినా చలివేస్తోంది. వేసవికాలం కాకపోయినా ఎండ భరించ శక్యం కాకుండా వుంది. నిండినా నిండకపోయినా కడుపు ఒక్కలాగే ఉంటోంది, నిండకపోవడం పరిపాటవుతోంది.

బైట,

అంతటా వర్షం పడుతోంది. ఎక్కడో పిడుగుపడింది. మాటిమాటికీ మెరుస్తోంది.

అతను మాత్రం చూడకుండా, 'చస్తే యెంత బావుణ్ణు' అనే విషయం గురించి ఆలోచిస్తూ కూర్చుండి పోయేడు.

చిన్న మగత నిద్రపట్టింది కాబోలు.

ఇంతలో చూరునుంచి ఒక పెంకు జారిపడింది కాబోలు.

అందుకే కాబోలు అతనికి మెలకువ వచ్చింది.

కళ్ళు నులుపుకొని అటూ ఇటూ పైకీ కిందకీ చూస్తున్నాడు.

తాకితే తగిలేటంత చిక్కటి చీకటితో నిండుకొని, అండాలతో నీళ్ళు గుమ్మరించిన ఆకాశం నిద్రలేచి చూసేసరికి నల్లగా నిగనిగలాడుతూ కంటికి స్పష్టంగా కనిపిస్తోంది. అందులో, వెదజల్లిన ముత్యాల్లాగ యెక్కడ యెటు చూసినా చక్కటి చుక్కలు వెలుగుతున్నాయి. మొత్తేసిన మేఘాల్ని చలిగాలి ఇంకోవైపుకి యెక్కడికో మోసుకుపోయింది. గాలి వీయడంలేదు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కణ్ణించో అతి సన్నగా పాట వినిపిస్తోంది. అందుచేత మిగతా అంతా మరీ నిశ్శబ్దంగా ఉంది. స్నానంచేసి, కొత్తబట్టలు కట్టుకొని, పువ్వులు పెట్టుకొని, దీపంలేని గదిలోకి వచ్చిన ఆడమనిషి శరీరంలా ఆ రాత్రంతా యెంతో చల్లగా ఉంది.

అంతా నిశ్శబ్దంగా ఉంటూండగా, అతనలా చూస్తూండగా, వెలుగు-వెలుగు వెయ్యి దీపాల వెలుగు ఒక్కసారిగా ముంచేసింది!

వీనుల విందుగా నవ్వేరెవరో!

దేవతలు దేవతలు. దేవతలెవరో నవ్వుతున్నారు!

అప్పుడే నిద్ర లేవడంచేత, యెదట మేడ కనిపించకపోడం చేత, అక్కడ ఇల్లున్నాదని తెలియకపోడం చేత, ఆకాశానికి తలుపులు తెరిచేరనే అనుకున్నాడు. స్వర్గంలో దేవతలు నవ్వుతున్నారనే అనుకున్నాడు. వెలుగుతోపాటు వాహినిగా ముంచేసిన పాట గంధర్వ గానమనే అనుకున్నాడు.

వళ్ళంతా జలదరించి, పులకరించి తన్మయత్వం పొందింది.

వెలుగులోంచి రెండు చేతులు బైటికి వచ్చేయి.

"జల్లు పూర్తిగా పోయిందండీ... ఎంత చల్లగా హాయిగా ఉందో చూశారా!"

"నీ కంటేనా?"

ఆవిడ చేయీ అతని చేయీ లోనికి పోయాయి.

ఆవిడ అటువైపు తిరిగింది. తిరిగేలోపున అతనావిణ్ణి వెనక్కి లాగేడు.

ఎవరువారు?

మనుష్యులు కారు దేవతలు కారు; మనుష్యులు కారు దేవతలే!

వాళ్ళనలా చూడాలనే అనిపిస్తోంది.

వాళ్ళని చూడకుండా ఉండలేకుండా ఉన్నాడు.

* * *

ఆనాడు వర్షం కురుస్తూండగా, మిక్కిలి చీకటిగా ఉంటూండగా 'ప్రాణంపోతే ఎంత బావుండేది అనుకొంటూ చిన్న కునుకు తీసేడు. నిద్ర లేచేసరికి వర్షం వెలిసింది; ఆకాశం పువ్వులు విరిసింది; దేవతలు తలుపులు తెరచేరు.

ఆ క్షణానికది నిజంగా స్వర్గమే!

అందుచేతనే ప్రతిరాత్రీ అక్కడికి లాక్కుపోతుంది, ఆ అరిగిన పాత కర్ర.

వెళ్ళేసరికి కిటికీ తెరిచే వుంటుంది. దీపం వెలుగుతూనే ఉంటుంది.

వాళ్లు అక్కడే ఉంటారు. రేడియో పాడుతూనే వుంటుంది.

ఏడాది క్రితం ఆ ఊరు వచ్చిన తొలిరోజు రాత్రి ఆ కొన్ని క్షణాలూ "అది స్వర్గం; వారు దేవతలు" అని కలిగినట్టి ఆ భావన ప్రతిదినమూ కూడా ఆ చీకట్లో అక్కడికి వెళ్ళిన కొన్ని క్షణాలు మళ్ళీ కలుగుతుంది.

ఆ కొన్నిక్షణాలు కూడా అతని మనసు గాల్లో తేలి, చుక్కల్నిజేరి, అమృతంలో మునుగుతుంది. మునిగి తేలి తీరిగ్గా కూర్చున్నాక అతని మనసు పోతుంది ఆ పాటతో.

పంచరంగుల పువ్వులతోటల్లోకి, తెల్లపావురాల మెడవంపుల మెరపుల్లోకి, కొండనీడల కులికే, చల్లనితోటల నీడల్లోకి, తెలిమబ్బుల తేలిపోయే గాలిమేడల్లోకి, చుక్కల బాటల్లోంచి, ముత్యాల ముగ్గుల్లోంచి, స్వప్నాల స్వర్గాల్లోకి, స్వర్గాల స్వప్నాల్లోకి, అదీ ఆ కిటికీ.

అక్కడికి వచ్చి ఆ అనుభూతి పొందడానికైనా బతకాలని ఉందతనికి. ఆ రాత్రినుంచీ బతికిస్తూ వస్తూన్నదే ఆ కిటికీ, ఆ కోరిక, ఆ అనుభూతి.

ఆకాశంకాదు; పాతమేడ, స్వర్గానికి సింహద్వారం కాదు; ఊచల్లేని కిటికీ. ఇంద్రనగరపు దీపశిఖరంకాదు; ఊళ్లో ఉండే మామూలు విద్యుద్దీపం. గంధర్వగానం కాదు; రేడియోపాట. దేవతలు కారు; సామాన్య యువతీ యువకులు. అది స్వర్గం కానేకాదు; వెల్లవేసిన చిన్నగది.

అవొచ్చు. అంతే కావచ్చు. నిజం అంతేకూడాను. కాని ఆ నిజంతో అతనికి ప్రసక్తిలేదు.

ఇంద్రుని హర్మ్యం, స్వర్గ కవాటం, రత్నఖచితకుడ్యం, మాణిక్య దర్పణం, హంసతూలికా తల్పం, అమరుల ఆరనిదీపం, సువర్ణసింహాసనం, నిర్జర మిధునం అతివాస్తవిక అధివాస్తవిక స్వర్గం.

అతనికి-

అదే నిజం. అవే నిజం. వారే నిజం.

తనకి ఎంతో నిజమైన ఈ అబద్ధాల్ని చూడ్డానికే అతను యెంతో దూరంనుంచి శ్రమపడి వస్తోన్నది.

ఆ కిటికీ వెనక నిజం యేమిటో, ఆ కిటికీ వెనక వాళ్ల నిజంగా యెవరో అతనికి తెలుసుకోవాలని లేదు. తెలిస్తే రోజూ కలిగే భావన మరింక కలక్కపోవచ్చు. ఆ భావనని, ఆ భ్రాంతుల్ని విడిచిపెట్టుకుందామనే ఉద్దేశం లేదతనికి.

-ఓ యీడాదవుద్ది కామోసు

అనుకున్నాడు కిటికీలోకి చూస్తూ.

ఆమె సోఫాలో కూర్చొనే వుంది. అతను సోఫాచేతి మీద కూర్చొని నవ్వుతూనే ఉన్నాడు. తీగపట్టుకు జారిన విద్యుద్దీపం వెలుగు వెదజల్లుతూనే ఉంది. రేడియో పాడుతూనే ఉంది. అంతా హాయిగా ఉంటూనే వుంది. స్వర్గం స్వర్గంలాగే ఉంది. అతనలా చూస్తూనే ఉన్నాడు.

కాని-

అలసటగా ఉందతనికి.

ఇతనికి ఈ దినం ఎంతో అలసటగా అలసటగా ఉంది.

స్వర్గాన్ని చూసినంత మాత్రాన అమరత్వం సిద్ధించదు. అలసటైనా తగ్గదు. ఆకలి తగ్గనే తగ్గదు.

బరువు రోజులు బరువుగా రోజుల్ని ఈడ్చే మనుష్యుల జవసత్వాల్ని పీల్చి పారేయక తప్పవు.

ఆరేసిన ముగ్గుల్లోంచి, గడ్డకట్టిన తారుమీంచి, గతుకులుపడ్డ కంకరలోంచి నడవడమే కష్టంగా వుండెను. దానికి తోడు, ధూళితో నిండినబాటలో ఆ ఎనభయ్యేడుగులూ తొందరగా నడవడంచేత కాబోలు మిక్కిలి అలసటగా ఉంది.

అలిసిపోయిన కళ్లు అమరలోకాన్ని చూస్తూనే ఉన్నాయి.

తాటిచెట్ల తలల్లోంచి లేచే నక్షత్రాలని కారు మేఘాలు కబళించేస్తున్నాయి.

బాగా చలిగా ఉంది.

అతనికి బాగా అలసటగా ఉంది.

-అదిగదీ, ఏట్రా అని సూత్తుండాను. ఇయాల మా చెడ్డ అల్చిపోనాను.

నడుం చేరవేసినా అలసటగా ఉంది.

–గుండెలేటి ఇలా కొట్టుకొంటున్నయ్!

గుండెల్లోదడగా నీరసంగా ఉంది.

–ఈ పొద్దింత సలేత్తోందేటి!

మధ్యాహ్నం ఎండగా ఉండెను. సాయంకాలంనుంచీ చలిగా ఉంటోంది.

ఇప్పుడు హెచ్చు చలిగా ఉండడమేకాక బాగా చీకటిగా కూడా ఉంది. ఆకాశం అంతా మబ్బులు మబ్బులుగా ఉంది.

–ఆ పొద్దునాగే ఈ పొద్దు కూడా సినుకడుద్ది కామోసు. మా సెడ్డ సలిగా ఉందే. దుప్పటిముక్క సిరిగినాది గందా! ఏటి సెయ్యటం?

ఆ కొసనుంచి ఈ కొసవరకూ ఆకాశం చీలి బద్దలయింది. మళ్ళీపోయింది. బలమైన గాయం తగిలినట్టుగా పెద్దగా ఘోష పెట్టింది.

చలిగాలి అధికారం చలాయిస్తోంది.

స్వర్గానిక్కూడా చలిగాలి సోకింది కాబోలు.

"తలుపులు వేసేదామండీ" అంది దేవత.

"సరే" అన్నాడు దివ్యుడు.

–అరె–తలుపేసీసినారే!

తెరచిన తెర కప్పుకుపోయింది.

సింహద్వారం మూసుకుపోయింది.

–ఇంత సీకటిగా ఉందేటి బగమంతుడా!

చీకటివరదలో మధురస్వప్నాలు మునిగిపోయేయి. ఆవరించుకున్న మేఘాల పొగల్లో మాయమయ్యేయి. నిత్యంగా ఉండాల్సిన వసంతం ఏదీ ఎక్కడికిపోయింది? కళ్ళముందు కదలాడిన ముత్యాలు, పల్లకీలు, స్వప్నాలు, స్వర్గాలు అన్నీ కూడా ఏమయిపోయాయి?

నలిగిన తెల్ల చీరతో కిటికీ దగ్గర నిల్చున్న చంద్రముఖి బద్ధకంగా వళ్లు విరుచుకొని, పడిపోయే ఎదటింటి వరండాలోకి చూసి, ఇంకా మంచంమీదే ఉన్న తనవానితో,

"పాపం, ఆ ముసలాడెవడోకాని అక్కడెలా ముడుచుకు పడుకున్నాడో చూడండీ! రాత్రంతా ఎంత చలివేసిందో ఏమో" అంది.

"నాక్కూడా ఇంకా చలిగా ఉంది. ఇలారా!" అని అతను శయ్య మీంచి పిల్చేడు.

"నే రాను" అంటూనే ఆమె ఆ వైపు వెళ్ళింది.

పడిపోయే పెంకుటింటి వరండాలో "ముడుచుకు పడుకున్న ముసలాణ్ణి" ధూళితో నిండిన, నలిగిన, చినిగిన, పేలికలవుతూన్న పాత దుప్పటీ సరిగా కప్పటం లేదు.

అతను కుళ్ళిన, బూజుపట్టిన, చేవలేని కర్రలా ఉన్నాడు. వర్షంలో తడిసిన కుళ్ళు చెత్తలా ఉన్నాడు. చర్మం అంతా ఎండి, సాగి, పిగిలినట్టుగా ఉంది. తలంతా బూజులా ఉంది. ముఖం సగం కాలిన కొబ్బరిచిప్పలా వుంది. ఆ ముఖంలో ఎడను కన్ను లేదు. వంగిన వింటిబద్ద అతని వీపు. మోచేతి వరకూ వచ్చి తెగిపోయినది అతని ఎడంచెయ్యి. అతని కుడి కాలికి లేనిది పాదం. పాదం ఉండవలసిన చోట ఉన్నది ధూళితో నిండిన ఒత్తుగా కట్టిన గుడ్డలకట్టు. అతని తలకింద ఉన్నవి తడిసిన మాసిన గుడ్డలు. అతని వంటి కిందది ఒక పొట్టి గోనె. పక్కన పడి ఉన్నవి రెండు చుట్ట పీకలూ, ఒక పాతకర్రా, తూట్లుపడ్డ ఒక మాసిన సంచీ, తుప్పుపట్టిన ఒక రేకుడొక్కు.

ఆ సంచీలో ఏముందో ఏమిలేదో కనిపించడం లేదు.

బాగ పొద్దెక్కింది. తాటిచెట్ల సందుల్లోంచి వచ్చే సూర్యకిరణాలు కొద్దిగా అతనిమీద పడుతున్నాయి.

కాని, ఈ లోకంలో ప్రాణానికి కారకుడైన ఆ సూర్యుడి కిరణాలు అతని మీద ఆ సమయంలో పడ్డం అర్థరహితంగా వుంది.

**భారతి, నవంబరు, 1953.**